సాక్షి
కుమురం భీం
బుధవారం । 20 । ఆగస్టు । 2025



వరదనీటితో పంటలకు ముప్పు
ఉమ్మడి జిల్లాలో వర్షాలకు వేలాది ఎకరాల్లో పంటలు నీట మునిగాయి. రైతులు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని కేవీకే శాస్త్రవేత్త రాజశేఖర్ సూచిస్తున్నారు. 8లో▸



నష్టపోయిన పంటల పరిశీలన
వరదలతో దెబ్బతిన్న పంటలను మంగళవారం వ్యవసాయశాఖ అధికారులు పరిశీలించారు. రైతులను అడిగి వివరాలు సేకరించారు. 9లో▸

గరిష్ఠం/కనిష్ఠం 29.5 /25.4
వాతావరణం
ఆకాశం పూర్తిగా మేఘావృతమై ఉంటుంది. అల్పపీడనం, రుతుపవనాల ప్రభావంతో అక్కడక్కడ మోస్తరు వానలు కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

21, 22 తేదీల్లో లోక్‌అదాలత్ సన్నాహక సమావేశాలు

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లాలో సెప్టెంబర్ 13న నిర్వహించే జాతీయ లోక్‌అదాలత్ కోసం ఈ నెల 21న పోలీసుశాఖ అధికారులు, 22న బార్ అధ్యక్షులు, అసోసియేషన్ సభ్యులు, ప్యానల్ అడ్వకేట్లు, బీమా సంస్థల ప్రతినిధులతో జిల్లా కేంద్రంలోని న్యాయస్థానంలో సన్నాహక సమావేశాలు నిర్వహిస్తున్నట్లు జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయసేవాధికార సంస్థ చైర్మన్ ఎంవీ రమేశ్ ఒక ప్రకటనలో తెలిపారు. జాతీయ లోక్‌అదాలత్ కార్యక్రమంలో క్రిమినల్, సివిల్, ప్రీ లిటిగేషన్, బ్యాంకింగ్, విద్యుత్, భూ సమస్యల కేసులు, వివాహం, కుటుంబ కలహాల కేసులు, మోటార్ వెహికిల్, ప్రమాద కేసులు, చిట్ ఫండ్, చెక్ బౌన్స్ కేసుల తోపాటు ఇతర కేసులు రాజీమార్గం ద్వారా పరిష్కరించేందుకు ప్రతిఒక్కరూ సమన్వయం తో కృషి చేయాలని సూచించారు.

‘వాటర్‌షెడ్ పథకంలో అవినీతి’

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లావ్యాప్తంగా వాటర్‌షెడ్ పథకంలో అవినీతి జరిగిందని, దీనిపై సమగ్ర విచారణ చేపట్టాలని కేవీపీఎస్, డీవైఎఫ్ఐ నాయకులు జిల్లా కేంద్రంలో మంగళవారం అదనపు కలెక్టర్ దీపక్ తివారికి ఫిర్యాదు చేశారు. వారు మాట్లాడుతూ వాటర్‌షెడ్ పథకంలో ఒక్కో పంచాయతీలో రూ.10లక్షల మేర అవినీతి జరిగినట్లు తెలుస్తోందని, ఇందులో కొందరు ఏపీఎంలు, సీసీల భాగస్వామ్యం ఉందని ఆరోపించారు. అవినీతికి పాల్పడిన డీఆర్‌డీవోపై చర్యలు తీసుకోవాలని కోరారు. స్పందించిన అదనపు కలెక్టర్ సమగ్ర విచారణ చేపడతామని హామీ ఇచ్చారని, కొంతమేర నిధులు రికవరీ చేసినట్లు వెల్లడించారని వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు టీకానంద్, కార్యదర్శి కార్తీక్, కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి దినకర్, నాయకులు మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎక్సైజ్ సూపరింటెండెంట్ కార్యాలయం తనిఖీ



డిప్యూటీ కమిషనర్ రఘురాంకు పూలమొక్క ఇస్తున్న ఎక్సైజ్ శాఖ అధికారులు

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ కార్యాలయాన్ని మంగళవారం ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ రఘురాం తనిఖీ చేశారు. క్రైమ్ రేట్ తగ్గించాలని, గ్రామాల్లో గుడుంబా నివారణకు చర్యలు తీసుకోవాలని సిబ్బందిని ఆదేశించారు. డిప్యూటీ కమిషనర్‌కు డీపీఈవో సిబ్బంది పూలమొక్క అందించి స్వాగతం పలికారు. అంతకుముందు కలెక్టర్ వెంకటేశ్ దోత్రేను ఆయన మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ జ్యోతికిరణ్, సీఐలు రవికుమార్, రమేశ్ పాల్గొన్నారు.

‘ఎన్టీఆర్ సాగర్’ కాలువకు గండి



1ఆర్ కాలువకు పడిన గండి

తిర్యాణి(ఆసిఫాబాద్): మండలంలోని ఎన్టీఆర్ సాగర్ (చెలిమల) ప్రాజెక్టు 1ఆర్ కాలువ ద్వారా చెలిమల నుంచి చిన్న అరటిపెల్లి వరకు సాగు నీటిని అందిస్తున్నారు. అయితే ఇటీవల ఎదులపహాడ్ శివారులో కాలువకు గండి పడింది. సాగునీరు వృథాగా పోతోంది. వెంటనే కాలువకు పడిన గండి పూడ్చి సాగునీరందించాలని ఆయకట్టు రైతులు కోరుతున్నారు.



పెంచికల్‌పేట్ మండలం గుండెపల్లిలో వర్షాలకు దెబ్బతిన్న పత్తి పంట

వర్ష బీభత్సం.. అపార నష్టం

- జిల్లాను ముంచెత్తిన వర్షాలు
- వేలాది ఎకరాల్లో నీట మునిగిన పంటలు
- లోతట్టు ప్రాంతాల్లో ఆస్తినష్టం
- నేడు వరద ప్రభావిత ప్రాంతాల్లో ఇన్‌చార్జి మంత్రి పర్యటన
- ప్రభుత్వం ఆదుకోవాలని బాధితుల వేడుకోలు



రెబ్బెనలోని ఎన్టీఆర్‌నగర్‌లోకి చేరిన వరద

రెబ్బెన(ఆసిఫాబాద్): జిల్లాలో వారం రోజులుగా కురుస్తున్న కుండపోత వానకు లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. వందలాది ఎకరాల్లో పంటలు నీటి మునిగాయి. భారీ వరదకు పొలాల్లో ఇసుక మేటలు వేస్తున్నాయి. భూమిలో తేమశాతం అధికమై పంటల ఎదుగుదలపై ప్రభావం చూపి దిగుబడి తగ్గుతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. పలు ప్రాంతాల్లో జనజీవనం స్తంభించి ఆస్తినష్టం జరిగిన నేపథ్యంలో వరద ప్రభావిత ప్రాంతాల్లో బుధవారం ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు పర్యటించనున్నారు. ప్రభుత్వం పరిహారం అందించి ఆదుకోవాలని బాధితులు వేడుకుంటున్నారు.

భారీగా పంట నష్టం

జిల్లాలోని పలు మండలాల్లో అధిక వర్షాలతో వేలాది ఎకరాల్లో పంట నష్టం వాటిల్లింది. కొన్ని మండలాల్లో వాగుల ఉధృతి ఇంకా కొనసాగుతుండగా, పంట నష్టంపై వ్యవసాయ శాఖ అధికారులు పూర్తిస్థాయిలో సర్వే చేపట్టలేకపోతున్నారు. వరద ప్రభావం తగ్గుముఖం పట్టగానే వాస్తవిక పంట నష్టంపై కచ్చితమైన సమాచారం అందనుంది. ప్రధానంగా పెద్దవాగు, పెన్‌గంగ పరీవాహక ప్రాంతాల్లో భారీగా పంట నష్టం జరిగింది. దహెగాం మండలంలో పెద్దవాగు, ఎర్రవాగులు ఉప్పొంగి ప్రవహించడంతో వాగులకు సమీపాన సాగు చేస్తున్న పత్తి, వరి పంటలు సుమారు ఐదు వేల ఎకరాల్లో నష్టం వాటిల్లింది. పెంచికల్‌పేట్ మండలంలో పెద్దవాగు ప్రభావంతో అగర్‌గూడ, గుండెపెల్లి, కమ్మర్‌గాం, నందిగాం, ప్రాణహిత నది ప్రభావంతో మొర్లిగూడ, జిల్లెడ గ్రామాల్లో సుమారు 500 ఎకరాలు పత్తి పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయి. అదే తరహాలో ప్రాణహిత నది ప్రభావంతో బెజ్జూర్ మండలంలోని తలాయి, పికపల్లి, సోమిని గ్రామాల్లో పంటలకు నష్టం వాటిల్లింది. పెన్‌గంగ ప్రవాహానికి సిర్పూర్(టి) మండలంలో భారీగా పంటనష్టం సంభవించింది. ఆయా మండలాల్లోని వరద ప్రభావం ఇంకా ఉండటంతో వ్యవసాయ శాఖ అధికారులు దెబ్బతిన్న పంటలపై పూర్తిస్థాయిలో సర్వే చేపట్టలేదు. ప్రస్తుతానికి ప్రాథమిక అంచనాకు వచ్చినట్లు సమాచారం. వరద ఉధృతి తగ్గగానే పంటలు పరిశీలించి ప్రభుత్వానికి నివేదిక అందించేందుకు అధికారులు సిద్ధమవుతున్నారు. రెబ్బెన మండలం జక్కులపెల్లిలో మంచిర్యాల జిల్లాలోని భీమిని ప్రాజెక్టు బ్యాక్ వాటర్ కారణంగా సుమారు 100 ఎకరాల్లో పత్తి పంటలు నీటమునిగాయి. గంగాపూర్ వాగు పరిసరాల్లో సాగు చేస్తున్న కూరగాయల తోటలు దెబ్బతిని రైతులకు తీవ్ర నష్టాన్ని మిగిల్చాయి. మండల కేంద్రంలోని ఎన్టీఆర్ నగర్ వరదనీటితో ముంపునకు గురైంది.

దెబ్బతిన్న రోడ్లు, కాలువలు

భారీ వర్షాలతో పంట నష్టంతో పాటు రూ.కోట్ల ఆస్తినష్టం సంభవించినట్లు జిల్లా అధికార యంత్రాంగం నిర్ధారించింది. ఇళ్లతోపాటు రోడ్లు, కెనాల్స్ దెబ్బతిన్నాయి. చింతలమానెపల్లి మండలంలో ఒకరు చెరువులో మునిగి మృతి చెందగా, మరో ఇద్దరు వ్యక్తులు పిడుగుపడి మృత్యువాత పడ్డారు. ఆసిఫాబాద్ మండలంలో వాగు దాటే ప్రయత్నంతో 40 గొర్రెలు వరద ప్రవాహానికి కొట్టుకుపోగా, తిర్యాణి మండలం 3 ఎద్దులు, 4 ఆవులు పిడుగుపాటుకు ప్రాణాలు కోల్పోయాయి. ఇప్పటి వరకు మూడు ఇళ్లు పూర్తిగా ధ్వంసం కాగా.. 25 ఇళ్లు పాక్షికంగా దెబ్బతిన్నాయి. ఆర్‌అండ్‌బీ రోడ్లు 25, పంచాయతీరాజ్ రోడ్లు 14, ఐటీడీఏ రోడ్లు 5 వర్షానికి దెబ్బతిన్నాయి. వాటితో పాటు ఆసిఫాబాద్ మండలంలోని వట్టివాగు కాలువకు గండిపడగా, కుమురంభీం ప్రాజెక్టు ఎడమ కాలువ కట్ట వాంకిడి మండలంలో తెగిపోయింది. ప్రస్తుతం ఈ కెనాల్స్‌కు తాత్కాలిక మరమ్మతులు చేయాలన్నా రూ.28 లక్షలు ఖర్చు చేయాల్సి ఉంది. శాశ్వత మరమ్మత్తుల కోసం రూ.1.5కోట్లు అవసరం ఉంటుంది. అలాగే ఆరు పాఠశాలల్లో ప్రహరీలు, ఒక పాఠశాలలో కిచెన్‌షెడ్డు కూలిపోయింది.

నేడు మంత్రి ‘జూపల్లి’ పర్యటన

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లాలోని వరద ప్రభావిత ప్రాంతాల్లో బుధవారం ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు పర్యటిస్తారని కలెక్టర్ వెంకటేశ్ దోత్రే ఒక ప్రకటనలో తెలిపారు. మొదట రెబ్బెన మండలం గోలేటి పెట్రోల్ పంపు సమీపంలోని వరద ప్రాంతాలను పరిశీలించి, అనంతరం ఎన్టీఆర్ కాలనీని సందర్శిస్తారు. దహెగాం మండలం పెసరకుంట గ్రామంలో పర్యటిస్తారు. అక్కడి నుంచి కాగజ్‌నగర్ పట్టణంలోని వర్షాలకు శిథిలమైన నివాసాలను, ఆ తర్వాత ఆసిఫాబాద్ మండలం రాజూర గ్రామంలో తెగిపోయిన కల్వర్టు పరిశీలిస్తారు. అనంతరం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ సమావేశ మందిరంలో వర్షాకాలంలో తీసుకోవాల్సిన చర్యలు, జిల్లాలో జరుగుతున్న అభివృద్ధి పనులపై సంబంధిత అధికారులతో సమీక్షిస్తారని కలెక్టర్ పేర్కొన్నారు.

సిర్పూర్ నియోజకవర్గంలో అధిక ప్రభావం

ఆసిఫాబాద్ నియోజకవర్గంతో పోలిస్తే సిర్పూర్ నియోజకవర్గంలో వర్షాల ప్రభావం తీవ్రంగా ఉంది. పెన్‌గంగ, ప్రాణహిత, పెద్దవాగులకు ఎగువ మహారాష్ట్ర నుంచి భారీగా వరదనీరు పోటెత్తడంతో పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. రెండేళ్ల క్రితం దెబ్బతిన్న పంటలకు గతేడాది ఎకరానికి రూ.10వేల చొప్పున ఇన్‌పుట్ సబ్సిడీ అందించి రైతులకు కాస్త ఊరట కలిగించింది. ఈసారి సైతం దెబ్బతిన్న పంటలపై పూర్తిస్థాయిలో సర్వేలు నిర్వహించి ప్రభుత్వం పరిహారం అందించేలా కృషి చేయాలని రైతులు కోరుతున్నారు.

విద్యార్థుల సంక్షేమానికి పెద్దపీట

- రాష్ట్ర మంత్రి జూపల్లి కృష్ణారావు



డార్ఫ్ దంపతుల విగ్రహాలకు నివాళులర్పిస్తున్న మంత్రి కృష్ణారావు

జైనూర్(ఆసిఫాబాద్): ప్రభుత్వ పాఠశాలలు, సంక్షేమ వసతిగృహాల్లోని విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించడంతోపాటు వారి సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి, ఎక్సైజ్, పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. జైనూర్ మండలం మార్లవాయి గిరిజన ఆశ్రమ పాఠశాలలో మంగళవారం గురుకుల నిద్ర కార్యక్రమానికి హాజరయ్యారు. ముందుగా డార్ఫ్ దంపతుల విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. డార్ఫ్ స్మారక భవనంలో ఏర్పాటు చేసిన చిత్రాల వివరాలు తెలుసుకున్నారు. చరిత్ర పుస్తకాలు ప్రింట్ చేయించాలని కలెక్టర్ వెంకటేశ్ దోత్రేను ఆదేశించారు. అనంతరం విద్యార్థుల వసతిగృహానికి చేరుకున్నారు. భోజన వివరాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎస్పీ కాంతిలాల్ పాటిల్, ఎమ్మెల్సీ దండె విఠల్, ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్, మాజీ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు, టీపీసీసీ ఉపాధ్యక్షురాలు ఆత్రం సుగుణ, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు అబ్దుల్ ముఖీద్, మార్లవాయి మాజీ సర్పంచ్ కనక ప్రతిభ వెంకటేశ్ పాల్గొన్నారు.

‘ఉపాధ్యాయులదే బాధ్యత’

ఆసిఫాబాద్‌రూరల్: పాఠశాలలు, వసతిగృహాల్లో విద్యార్థుల హాజరు పెంచాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందని అదనపు కలెక్టర్, డీఈవో దీపక్ తివారి అన్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో మంగళవారం ఎంఈవోలు, ప్రధానోపాధ్యాయులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులు విధులకు సక్రమంగా హాజరు కావాలని, ఫేస్ రికగ్నిజేషన్ సిస్టం ప్రకారం హాజరు నమోదు చేసుకోవాలని సూచించారు. సెలవుపై వెళ్లే ఒకరోజు ముందు అనుమతి తీసుకోవాలన్నారు. ఎస్‌వోలు శ్రీనివాస్, అబిద్ అలీ, ఉదయ్‌బాబు పాల్గొన్నారు. జిల్లా కేంద్రంలోని తెలంగాణ మోడల్ స్కూల్‌ను మంగళవారం అదనపు కలెక్టర్, డీఈవో దీపక్ తివారి అన్నారు. విద్యార్థుల హాజరుశాతం, వంటశాల, ప్రయోగశాలలను పరిశీలించారు. అనంతరం జన్కాపూర్ ఉన్నత పాఠశాలను సందర్శించారు. ఎంఈవో సుభాష్, ఎస్‌వో శ్రీనివాస్, ప్రిన్సిపాల్ మహేశ్వర్ ఉన్నారు.

కృత్రిమ కొరత సృష్టిస్తే చర్యలు

- కలెక్టర్ వెంకటేశ్ దోత్రే

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లాలో యూరియా నిల్వలు సమృద్ధిగా ఉన్నాయని, కృత్రిమ కొరత సృష్టిస్తే చర్యలు తప్పవని కలెక్టర్ వెంకటేశ్ దోత్రే అన్నారు. జిల్లా కేంద్రంలోని గాంధీచౌక్‌లో గల శ్రీనివాస ఫర్టిలైజర్ షాపును మంగళవారం ఆకస్మికంగా సందర్శించి రిజిస్టర్లు, ఈ పాస్ యంత్రం, ధరల పట్టిక, స్టాక్ వివరాలు పరిశీలించారు. కలెక్టర్ మాట్లాడుతూ రైతులు వ్యవసాయ అధికారుల సూచనల ప్రకారం యూరియా, ఇతర మందులు వినియోగించాలని సూచించారు. ఎరువులు, మందులు అధిక ధరలకు విక్రయిస్తే సంబంధిత షాపుల యజమానులపై చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ఏడీఏ మిలింద్‌కుమార్ పాల్గొన్నారు.

అర్హులైన గిరిజనులకు సంక్షేమ పథకాలు అందాలి

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులైన గిరిజనులకు అందాలని కలెక్టర్ వెంకటేశ్ దోత్రే అన్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో మంగళవారం దర్తీ అభ జన్ జాతీయ గ్రామ్ ఉత్కర్ష అభియాన్, ఆది కర్మ యోగి అభియాన్ అమలులో భాగంగా సంబంధిత శాఖల అధికారులు, జిల్లాస్థాయి మాస్టర్ ట్రైనర్లతో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడతూ ఆది కర్మ యోగి కార్యక్రమాల ద్వారా 12 మండలాల్లోని 102 గ్రామాల్లో ఉన్న గిరిజనులకు సంక్షేమ పథకాలు చేరేలా బ్లాక్ స్థాయి(మండల) మాస్టర్ ట్రైనర్లు గ్రామస్థాయి శిక్షకులకు శిక్షణ ఇవ్వాలన్నారు. వివిధ శాఖల నుంచి పంచాయతీ స్థాయి సిబ్బందిని ఎంపిక చేయాలని సూచించారు. శిక్షణ పూర్తయిన తర్వాత 102 గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించి కార్యాచరణ రూపొందించాలని ఆదేశించారు. అన్నివర్గాల ప్రజల భాగస్వామ్యం ఉండేలా చూడాలన్నారు. సమావేశంలో డీటీడీవో రమాదేవి, డీఆర్‌డీవో దత్తారావు, విద్యుత్‌శాఖ ఎస్‌ఈ శేషారావు, పంచాయతీరాజ్ ఈఈ కృష్ణ, మిషన్ భగీరథ ఈఈ సిద్దిక్, డీఎంహెచ్‌వో సీతారాం, లీడ్ డిస్ట్రిక్ మేనేజర్ రాజేశ్వర్ జోషి, జెడ్పీ సీఈవో లక్ష్మీనారాయణ, పర్యాటకశాఖ అధికారి అశోక్ పాల్గొన్నారు.



మందులు పరిశీలిస్తున్న కలెక్టర్ వెంకటేశ్ దోత్రే

రెండోరోజూ నిరవధిక నిరాహారదీక్ష

- ఎమ్మెల్యే హరీశ్‌బాబుకు పలువురు సంఘీభావం



ఎమ్మెల్యేకు వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యసిబ్బంది

కాగజ్‌నగర్‌టౌన్: పోడు భూముల సమస్యకు పరిష్కారం, జీవో 49 రద్దు కోసం సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు సోమవారం చేపట్టిన నిరవధిక నిరాహార దీక్ష రెండోరోజూ మంగళవారం కూడా కొనసాగింది. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజాభిప్రాయాన్ని తీసుకోకుండా కాంగ్రెస్ ప్రభుత్వం మే 30న తడోబా రిజర్వ్ ఫారెస్ట్‌ను కవ్వాల్ రిజర్వ్ ఫారెస్ట్‌లో కలుపుతూ కుమురం భీం జిల్లాలోని 334 గ్రామాలను రిజర్వు ఫారెస్ట్‌గా పేర్కొంటూ అక్రమంగా తీసుకువచ్చిన జీవో నం.49ను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. దిందా పోడు రైతులను రవీంద్రనగర్‌లోని కర్జెల్లి ఫారెస్ట్ కార్యాలయానికి పిలిపించి బెదిరింపులకు పాల్పడడం దారుణమని, దీనిని బీజేపీ తరఫున తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. అన్ని గ్రామాల్లో పోడు భూముల సమస్యను పూర్తిస్థాయిలో పరిష్కరించి, ప్రభుత్వం నుంచి జీవో 49 రద్దు చేస్తామనే ప్రకటన వచ్చే వరకు దీక్ష కొనసాగిస్తానని స్పష్టం చేశారు. కాగా, రెండోరోజు వైద్యులు ఎమ్మెల్యేకు వైద్య పరీక్షలు చేశారు. దీక్షకు సంఘీభావంగా సిర్పూర్(టి), బెజ్జూర్, కౌటాల, దహెగాం, కాగజ్‌నగర్, చింతలమానెపల్లి మండలాల నుంచి నాయకులు, కార్యకర్తలు తరలివచ్చారు.



పాల్వాయి హరీశ్‌బాబుకు పూలమాల వేసి మద్దతు తెలుపుతున్న బీజేపీ నాయకులు

శాసనసభ స్పీకర్‌కు లేఖ

కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలో జీవో 49 శాశ్వతంగా రద్దు చేయాలని, పోడు రైతుల సమస్యలు పరిష్కరించాలని శాసన సభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌కు ఎమ్మెల్యే హరీశ్‌బాబు లేఖ రాశారు. రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన జీవో 49 కుమురం భీం జిల్లాలో చిచ్చురేపుతుందన్నారు. పోడు రైతులు సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లేందుకు హైదరాబాద్‌కు కాలినడకన వెళ్తుండగా వారిని అరెస్టు చేసి సొంత గ్రామాలకు తరలించారని తెలిపారు. కాగజ్‌నగర్ అటవీ కార్యాలయం ముట్టడికి శాంతియుతంగా పిలుపునిస్తే ప్రభుత్వం అనుమతివ్వకుండా పోలీసులు గృహనిర్బంధం చేశారని ఆరోపించారు.

తప్పని నిరీక్షణ



పెంచికల్‌పేట్‌లోని గోదాం వద్ద యూరియా కోసం వేచిచూస్తున్న రైతులు



సిర్పూర్(టి)లో క్యూలైన్‌లో రైతులు

విస్తారంగా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో రైతులు యూరియా కోసం పరుగులు తీస్తున్నారు. ఓ వైపు అధికారులు కొరత లేదని చెబుతున్నా.. క్షేత్రస్థాయిలో మాత్రం ఎరువులు సరిపడా అందడం లేదు. పెంచికల్‌పేట్ మండల కేంద్రంలోని గోదాం వద్దకు మంగళవారం పెంచికల్‌పేట్, ఎల్లూర్, ఎల్కపల్లి, కొండపల్లి, కమ్మర్‌గాం గ్రామాలకు చెందిన రైతులు పెద్దఎత్తున తరలివచ్చారు. యూరియా కోసం గంటల తరబడి నిరీక్షించారు. అలాగే సిర్పూర్(టి) మండల కేంద్రంలోని మండల వ్యవసాయ శాఖ కార్యాలయం, ప్రాథమిక సహకార సంఘం కార్యాలయం వద్ద యూరియా కూపన్ల కోసం క్యూలైన్లలో నిలబడి పడిగాపులు కాశారు. సరిపడా యూరియా బస్తాలు పంపిణీ చేయాలని రైతులు కోరుతున్నారు. – పెంచికల్‌పేట్/సిర్పూర్(టి)

‘మినరల్’ దందా

- జిల్లాలో అనుమతి లేకుండా వాటర్ ప్లాంట్ల నిర్వహణ
- వర్షాకాలంలో అపరిశుభ్రమైన తాగునీటి సరఫరా
- ప్రజల ప్రాణాలతో చెలగాటం



బెజ్జూర్ మండల కేంద్రంలోని ఓ టీ హోటల్‌లో అపరిశుభ్రమైన వాటర్ క్యాన్

బెజ్జూర్(సిర్పూర్): ప్రభుత్వం నుంచి సరైన అనుమతి లేకుండా పుట్టగొడుగుల్లా ప్లాంట్లు ఏర్పాటు చేస్తూ.. మినరల్ వాటర్ పేరిట కొంతమంది ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారు. ప్యూరిఫైడ్ నీళ్ల పేరిట నిర్వాహకులు ఏటా రూ.లక్షలు సొమ్ము చేసుకుంటున్నారు. ప్రజలకు కలుషిత నీటిని అందిస్తున్నారు. కేవలం ఒక ట్యాంక్, మరో రెండు బాయిలర్ మాదిరి ట్యాంకులు.. అన్నింటినీ అనుసంధానిస్తూ పైప్‌లు ఏర్పాటు చేసుకుంటున్నారు. గతంలో పట్టణాలకు పరిమితమైన మినరల్ వాటర్ దందా ప్రస్తుతం గ్రామీణ ప్రాంతాలకూ విస్తరించింది. క్యాన్‌కు రూ.20 నుంచి రూ.50 వరకు వసూలు చేస్తున్నారు. వాస్తవంగా 20 లీటర్లను శుద్ధి చేయడానికి రూ.2 నుంచి రూ.3 మాత్రమే ఖర్చవుతుంది.

500లకు పైగా ప్లాంట్లు

జిల్లాలో ప్రస్తుతం 500 పైగా ప్లాంట్లు ఉన్నాయి. వీటిల్లో చాలా వరకు అనుమతి లేకుండా ఏర్పాటు చేసి కనీస నాణ్యతా ప్రమాణాలు పాటించడం లేదు. యంత్రాలు శుద్ధి చేయకపోవడం, జలాన్ని శుద్ధి చేయకుండా సాధారణ నీటినే క్యాన్లలో సరఫరా చేస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. జిల్లాలోని పలువురు ఇళ్లతోపాటు దుకాణాలు, పాత గదుల్లో ప్లాంట్లను నిర్వహిస్తున్నారు. కనీసం నీటి నిర్ధారణ పరీక్షలు కూడా చేయడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. జిల్లాలో నిబంధనలు పాటించని 30 వాటర్ ప్లాంట్లకు నోటీసులు ఇచ్చినట్లు అధికారులు చెబుతున్నారు. ఐఎస్ఐ సర్టిఫికెట్లు కొన్నింటికి ఉన్నా ఏటా రెన్యువల్ చేసుకోవడం లేదు.

నిబంధనలపై పట్టింపేది..?

వాటర్ ప్లాంట్‌లో మైక్రోబయాలజిస్ట్, కెమిస్ట్ సిబ్బంది తప్పనిసరిగా అందుబాటులో ఉంటూ పీహెచ్ విలువ 7 కంటే తగ్గకుండా చూసుకోవాలి. పీహెచ్ స్థాయిలో హెచ్చుతగ్గులు కిడ్నీలపై ప్రభావం చూపుతాయి. ప్రతీ క్యాన్‌పై నీటిని శుద్ధి చేసిన తేదీ, బ్యాచ్ నంబర్ కూడా వేయాలి. ప్లాంట్ నిర్వహణకు బీఎస్ఐ అనుమతి తీసుకోవడంతో పాటు ఐఎస్ఐ నిబంధనలు పాటించాలి. ప్రతీ మూడు నెలలకోసారి రా వాటర్ టెస్టింగ్ జరపాలి. కానీ పై నిబంధనలేవీ జిల్లాలోని ప్లాంట్ల నిర్వాహకులు పాటించడం లేదు. ఈ విషయంపై ‘సాక్షి’ భూగర్భజల శాఖ ఇన్‌చార్జి జిల్లా అధికారి కె.సుహాసినిని వివరణ కోరగా.. ఇప్పటివరకు జిల్లాలోని 30 వాటర్ ప్లాంట్లకు నోటీసులు ఇచ్చినట్లు తెలిపారు. కాగజ్‌నగర్, ఆసిఫాబాద్, కెరమెరి, జైనూర్, లింగాపూర్ తదితర ప్రాంతాల్లో ప్లాంట్ల నిర్వాహకులు నిబంధనలు పాటించకపోవడంతో నోటీసులు అందించామని పేర్కొన్నారు.

అప్రమత్తంగా ఉండాలి

మినరల్ వాటర్‌పై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. క్యాన్లు నిత్యం పరిశుభ్రంగా ఉండేలా చూసుకోవాలి. కాచి చల్లార్చిన నీటిని తాగాలి. వర్షాకాలంలో వాగు, చెలిమె నీళ్లు తాగొద్దు. – సీతారాంనాయక్, డీఎంహెచ్‌వో

క్లుప్తంగా

కినక వంశీయుల నవధాన్యాల పూజలు



సహపంక్తి భోజనం చేస్తున్న కినక వంశీయులు

ఇంద్రవెల్లి: మండలంలోని వాల్గొండలో మంగళవారం కినక వంశీయులు నవధాన్యాల (నొవ్వోంగ్) పూజలు ఘనంగా నిర్వహించారు. గ్రామ పటేల్ ఇంట్లో ప్రత్యేక పూజల అనంతరం నవధాన్యాలతో నైవేద్యం తయారు చేసి కుల దేవతకు సమర్పించారు. కినక వంశీయులంతా కలిసి సహపంక్తి భోజనాలు చేశారు. ఈ కార్యక్రమంలో కినక వంశీయులు కినక లచ్చు పటేల్, జుగాదిరావ్, మాన్కు పటేల్, దేవ్‌రావ్ కటోడ, సూర్యభాన్, యాదోరావ్, తదితరులు పాల్గొన్నారు.

ఎస్సారెస్పీ 39 గేట్ల ఎత్తివేత

మామడ: శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్‌లోకి మంగళవారం 2.75 లక్షల క్యూసెక్కుల వరద ప్రవాహం కొనసాగింది. అధికారులు ప్రాజెక్ట్ 39 గేట్లను ఎత్తి 3.25 లక్షల క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నారు. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటిమట్టం 1091 అడుగులు (80.5 టీఎంసీలు) కాగా ప్రస్తుతం ప్రాజెక్ట్‌లో 1089 అడుగుల (73.37 టీఎంసీలు) నీరు నిలకడగా ఉంది. ప్రాజెక్ట్ దిగువన గోదావరినది పరిసర ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు. పశువులు, గొర్రెల కాపరులు, మత్స్యకారులు, రైతులు గోదావరిని దాటే ప్రయత్నం చేయవద్దని సూచించారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత



పట్టుకున్న ఇసుక ట్రాక్టర్

నెన్నెల: కుమ్మరివాగు నుంచి బెల్లంపల్లికి అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను మంగళవారం పట్టుకున్నట్లు ఎస్సై ప్రసాద్ తెలిపారు. తమకు అందిన సమాచారం మేరకు దాడి చేసి డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని ట్రాక్టర్‌ను పోలీస్‌స్టేషన్‌కు తరలించామన్నారు. డ్రైవర్‌తో పాటు ఓనర్ గోలెం తిరుపతిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

ముగ్గురు పంచాయతీ కార్యదర్శుల తొలగింపు

- మరొకరికి చార్జ్‌మెమో

వేమనపల్లి: మండలంలోని ముగ్గురు పంచాయతీ కార్యదర్శులు విధుల్లో నిర్లక్ష్యం వహిస్తూ ఫేక్ అటెండెన్స్ పంపించిన కారణంగా ప్రభుత్వం వారిని విధుల్లో నుంచి తొలగిస్తున్నట్లు డీపీవో కార్యాలయం నుంచి మంగళవారం ఉత్తర్వులు వెలువడ్డాయి. సుంపుటం కార్యదర్శి వెంకటి, దస్నాపూర్ కార్యదర్శి రజిత, చామనపల్లి కార్యదర్శి యాదగిరిని విధుల నుంచి తొలగించగా ముల్కలపేట కార్యదర్శి సురేష్‌కు చార్జ్‌మెమో, ఎంపీడీవో కుమారస్వామికి షోకాజ్ నోటీసులు ఇచ్చారు. సమయపాలన పాటించకుండా పాత ఫొటోను తీసి క్షేత్ర స్థాయిలో విధుల్లో ఉన్నట్లు ఫేక్ అటెండెన్స్ పంపించడంతో ముగ్గురిపై వేటు పడింది.

వర్షానికి కూలిన ఇళ్లు



దస్తురాబాద్‌లో కూలిన ఇల్లు

దస్తురాబాద్: వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు మంగళవారం మండలంలోని బుట్టాపూర్ గ్రామానికి చెందిన గుండ లక్ష్మి, మండల కేంద్రంలోని గంప భారతకు చెందిన ఇల్లు కూలిపోయాయి. కూలిన ఇళ్లను తహసీల్దార్ విశ్వంబర్, పంచాయతీ కార్యదర్శి పరిశీలించారు.

సాత్నాల: ఇటీవల కురుస్తున్న వర్షాలకు భోరజ్ మండలంలోని ఆకోలి గ్రామానికి చెందిన ఆత్రం రంగనాథ్ ఇల్లు కూలింది. మంగళవారం అకస్మాత్తుగా గోడలు కూలిపోవడంతో ఇంట్లో ఉన్న నలుగురు కుటుంబ సభ్యులు భయంతో బయటకు పరుగులు తీయడంతో ప్రమాదం తప్పింది. ఇల్లు పూర్తిగా ధ్వంసం కావడంతో ఆ కుటుంబ సభ్యులు నిరాశ్రయులయ్యారు. కూలీపని చేసుకుని జీవనం సాగించే తమకు ఇల్లు నిర్మించుకునే ఆర్థిక స్తోమత లేదని, శాశ్వత గృహం మంజూరు చేయాలని వేడుకుంటున్నారు.

ఫోన్ ట్యాపింగ్ కేసులో కాంగ్రెస్ నేత వాంగ్మూలం

భీమారం: రాష్ట్ర వ్యాప్తంగా సంచలనంగా మారిన ఫోన్‌ట్యాపింగ్‌లో భీమారం మండల కాంగ్రెస్ నేత పాడేటి రవి ఇటీవల సిట్ విచారణకు హాజరైనట్లు ఆలస్యంగా తెలిసింది. పంజాగుట్ట పోలీస్‌స్టేషన్ నుంచి పిలుపు వచ్చిన మాట వాస్తవమేనని రవి 'సాక్షి'కి మంగళవారం తెలిపారు. ఈ మేరకు విచారణలో శాసనసభకు జరిగిన ఎన్నికల్లో చెన్నూర్ కాంగ్రెస్ పార్టీకి చెందిన నగదు తరలిస్తుండగా మందమర్రి ఏరియాలో ఎన్నికల అధికారులు పట్టుకున్నారు కదా అని, అప్పట్లో ఇబ్బందికరంగా ఏమైనా ఫోన్లు వచ్చాయా అని సిట్ అధికారులు ప్రశ్నించినట్లు తెలిపారు. తాను కాంగ్రెస్‌పార్టీకి విధేయునిగా ఉన్నందునే అప్పటి ప్రభుత్వం తనఫోన్ ట్యాప్ చేయించిందని, ఈ విషయం అధికారులు తనకు చెప్పేంత వరకు తెలియదని అన్నారు.

వరదనీటితో పంటలకు ముప్పు

- జాగ్రత్తలు పాటించకుంటే నష్టం
- రాజశేఖర్, ఆదిలాబాద్ కృషి విజ్ఞానకేంద్రం శాస్త్రవేత్త



భీమిని మండలంలో పత్తి పంటలో వరద నీరు



రాజశేఖర్, శాస్త్రవేత్త

మంచిర్యాలఅగ్రికల్చర్: ఉమ్మడి జిల్లాలో ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో 16.20 లక్షల ఎకరాల్లో వివిధ రకాలు పంటలు సాగయ్యాయి. ఇందులో అధికశాతం రైతులు పత్తి సాగు చేశారు. ఉమ్మడి జిల్లాలో వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు లోతట్టు ప్రాంతాల్లో వేలాది ఎకరాల్లో పంటలు నీట మునుగుతున్నాయి. పత్తి, వరి, సోయా, కంది పంటలకు ముప్పు వాటిల్లే ప్రమాదం ఉంది. కొన్ని ప్రాంతాల్లో వరద నీటితో పంటల్లో మట్టి, ఇసుక మేటలు వేసి తీరని నష్టాన్ని మిగులుస్తున్నాయి. దీంతో చేనులోంచి నీటిని పంపించేందుకు రైతులు పడరాని పాట్లు పడుతున్నారు. మరోవైపు నీటి పదను ఎక్కువై మొక్కలు జాలువారి పోతున్నాయి. పంటకు వేరుకుళ్లు, ఎండు తెగులు, ఆకుమచ్చ, కాండం కుళ్లు తెగుళ్లు సోకడంతో ఆకులు పసుపు వర్ణం, ఎర్రబారిపోవడంతో పంట దిగుబడి తగ్గే ప్రమాదం ఉందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వరద ప్రభావిత ప్రాంతాల రైతులు ఈ సమయంలో అప్రమత్తంగా ఉండి సరైన యాజమాన్య పద్ధతులు పాటించాలని, పంటల్లో సస్య రక్షణ చర్యలు చేపట్టాలని ఆదిలాబాద్ కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త రాజశేఖర్ సూచిస్తున్నారు.

పత్తి పంటలో..

- పంట చేలల్లో కాల్వలు తీసి నీటిని బయటకు పంపించాలి. వీలైనంత త్వరగా అంతర కృషి చేయాలి. దీనివల్ల భూమిలో తేమ తగ్గి వేర్లకు గాలి, పోషకాలు అందడంతో మొక్కలు త్వరగా సాధారణ స్థితికి వస్తాయి. నీరు బయటకు పంపిన తర్వాత ఎకరాకు 25 కిలోల యూరియా, 10 కిలోల పొటాష్‌ను మొక్కకు 5 నుంచి 6 సెంటిమీటర్ల దూరంలో గుంతలు తీసి వేయాలి. లేదా అంతరకృషి చేయాలి.
- పొలంలో తేమ అధికంగా ఉన్నప్పుడు వేర్లు పోషకాలు, నీటిని తీసుకోలేక ఆకులు లేత ఆకుపచ్చ రంగులోకి మారుతాయి. దీనివల్ల మొక్కల పెరుగుదల తగ్గుతుంది. కాబట్టి 20 గ్రాముల యూరియా లేదా పది గ్రాముల 20-20 లీటరు నీటిలో కలిపి ఐదురోజుల వ్యవధిలో రెండు మూడు సార్లు పిచికారీ చేస్తే మొక్కలు త్వరగా కోలుకుంటాయి.

భూమి, వాతావరణంలో తేమ అధికంగా ఉన్నప్పుడు పత్తిని ఆకుపచ్చ తెగులు ఆశించే అవకాశం ఉంది. దీని నివారణకు పది లీటర్ల నీటిలో కాపర్ ఆక్సీక్లోరైడ్ 30 గ్రాములు, గ్రాము స్ట్రెప్టోసైక్లిన్‌ను కలిపి పిచికారీ చేయాలి.

- భూమిలో అధిక తేమ ఉన్నప్పుడు వేరుకుళ్లు తెగులు ఆశించి మొక్కలు చనిపోతాయి. దీని నివారణకు కాపర్ ఆక్సీక్లోరైడ్ మూడు గ్రాములు లేదా కార్బండిజమ్ రెండు గ్రాములు లీటర్ నీటిలో కలిపి ద్రావణాన్ని తెగులు సోకిన మొక్క మొదళ్లలో పోయాలి.

ఆకుముడుత పురుగు

ఈ పురుగు ఆకుముడుతలో ఉండి పత్రహరితాన్ని హరించడంతో ఆకులు తెల్లబడుతాయి. దీని నివారణకు పిలక దశలో చేనుకు అడ్డంగా తాడుతో 2 నుంచి 3 సార్లు లాగితే పురుగులు కిందపడిపోతాయి. ఆతర్వాత క్లోరిపైరీఫాస్ 2.5 మిల్లీలీటర్లు లేదా కార్టాప్ హైడ్రోక్లోరైడ్ రెండు గ్రాములు లేదా క్లోరాన్ నిలిప్రోల్ 0.4 మిల్లీలీటర్లు లేదా ఎసిఫేట్ 1.5 గ్రాములు లేదా ఫ్లూబెండమైడ్ 20 డబ్ల్యూడీజీ 0.25 గ్రాములు లేదా 48 ఎస్‌సీ 0.1 మిల్లీలీటర్లు లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయాలి. లేదా కార్టాప్ హైడ్రోక్లోరైడ్ 4 జి గుళికలు ఎకరాకు ఎనిమిది కిలోల చొప్పున వేయాలి.

వరి పంటలో..

వరి సాగు చేసిన రైతులు ఇప్పటికే నాట్లు వేసినట్లయితే పంటలో ఎక్కువ మోతాదులో నీరు ఉండకుండా చూడాలి. ముంపు పాలైన వరి పొలాల్లో తెగుళ్లు వ్యాపించే అవకాశం ఉంది. వీలైనంత త్వరగా నిల్వ ఉన్న నీటిని బయటకు పంపించిన తర్వాత ఎకరాకు 20 కిలోల యూరియా, 10 కిలోల పొటాష్ వేయాలి.

తాటాకు తెగులు

హిస్పాపిల్లా పెద్దపురుగులు ఆకులోని పత్రహరితాన్ని గోకి తినడం వల్ల తెల్లటి చారలు ఏర్పడి ఆకులు ఎండిపోతాయి. దీని నివారణకు మోనోక్రోటోఫాస్ 1.6 మిల్లీలీటర్లు లేదా క్లోరోపైరీఫాస్ 2.5 మిల్లీలీటర్లు లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయాలి.

పొడతెగులు

ఆకులపై పాము పొడ మచ్చలుగా ఏర్పడి మొక్కలు పూర్తిగా ఎండిపోతాయి. దీని నివారణకు హెక్సాకొనజోల్ రెండు మిల్లీలీటర్లు లేదా వాలిడా మైసిన్ రెండు మిల్లీలీటర్లు లేదా వాలిడా మైసిన్ రెండు మిల్లీలీటర్లు లేదా ప్రోపికొనజోల్ 1 మిల్లీలీటర్ లేదా ట్రైఫ్లాక్సిస్ట్రోబిన్+ టెబ్యుకొనజోల్ 75 డబ్ల్యూజీ 0.4 గ్రాములు లీటర్ నీటిలో కలిపి 15 రోజులకు ఒకసారి చొప్పున రెండు సార్లు పిచికారీ చేయాలి.

అగ్గితెగులు

అగ్గితెగులు నివారణకు ట్రైసైక్లోజోల్ 0.6 గ్రాముల లేదా ఐసోప్రోదయేలేన్ 1.5 మిల్లీలీటర్లు లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయాలి.

లారీ బోల్తాపడి డ్రైవర్ మృతి



డ్రైవర్ అనిల్ మృతదేహం

నేరడిగొండ: బ్రిడ్జి పైనుంచి లారీ కిందపడిన ఘటనలో డ్రైవర్ మృతి చెందిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఇచ్చోడ సీఐ రాజు తెలిపిన వివరాల మేరకు మహారాష్ట్రలోని నాగ్‌పూర్ నుంచి హైదరాబాద్ వైపు వెళ్తున్న ఐచర్ కంటైనర్ నేరడిగొండ మండలంలోని కుప్టి వంతెన వద్ద అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో డ్రైవర్ అనువతే అనిల్ (38) క్యాబిన్‌లోనే ఇరుక్కుని మృతి చెందాడు. మృతదేహాన్ని క్రేన్ సహాయంతో బయటకు తీశారు. అతివేగంగా, అజాగ్రత్తగా నడపడంతోనే ఈ ప్రమాదం జరిగిందని సీఐ తెలిపారు. ఎస్సై ఇమ్రాన్ సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకుని పంచనామా నిర్వహించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు తెలిపారు.

108లో ప్రసవం



కవల పిల్లలకు జన్మనిచ్చిన ప్రతిక్ష

ఇచ్చోడ: మండలంలోని ముఖరా బి గ్రామానికి చెందిన గర్భిణి ప్రతిక్షకు మంగళవారం పురిటినొప్పులు రావడంతో ఆమె భర్త అనిల్ 108కు సమాచారం అందించాడు. అంబులెన్సులో ఇచ్చోడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలిస్తుండగా మార్గమధ్యలోనే నొప్పులు ఎక్కువ కావడంతో ఈఎంటీ రాకేశ్, ఈఆర్‌సీపీ డాక్టర్ కొశిరెడ్డి సలహా మేరకు వాహనంలోనే డెలివరీ చేశారు. మొదటికాన్పులో ఇద్దరు ఆడపిల్లలకు జన్మనిచ్చింది. తల్లీపిల్లలు క్షేమంగా ఉండటంతో వారిని ఇచ్చోడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. పైలట్ వినోద్, ఈఎంటీ రాకేశ్‌ను గ్రామస్తులు అభినందించారు.

నీటి ప్రవాహంతో నిలిచిన బస్సు



ప్రయాణికులను వాగు దాటిస్తున్న ఎస్సై

భీంపూర్: మండలంలోని గోముత్రి, కరంజి గ్రామాలకు బయలుదేరిన బస్సు మంగళవారం రాత్రి అంతర్గామ వద్ద వాగు ఉప్పొంగి ప్రవహించటంతో మార్గమధ్యలో నిలిపివేశారు. విషయం తెలుసుకున్న ఎస్సై పీర్‌సింగ్ నాయక్ ఘటనా స్థలానికి చేరుకుని స్థానిక యువకులతో కలిసి తాడు సహాయంతో ప్రయాణికులను వాగు దాటించారు. నీటి ప్రవాహం ఎక్కువగా ఉన్నప్పుడు వాగులు, వంకలను దాటవద్దని, అత్యవసర సమయంలో పోలీసు యంత్రాంగాన్ని సంప్రదించాలని ఎస్సై సూచించారు.

చిట్టీ డబ్బులు కాజేసిన మహిళపై కేసు

ఆదిలాబాద్‌టౌన్: చిట్టీ డబ్బులు కాజేసిన మహిళపై మంగళవారం కేసు నమోదు చేసినట్లు టూటౌన్ సీఐ నాగరాజు తెలిపారు. ఆదిలాబాద్ పట్టణంలోని సంజయ్‌నగర్ కాలనీకి చెందిన ఓ మహిళ 20 మంది వద్ద నెలకు రూ.10 వేల చొప్పున చిట్టీ పేరిట డబ్బులు వసూలు చేసి ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేయడంతో బాధితులు టూటౌన్ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు సదరు మహిళపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

ఆర్టీసీ డ్రైవర్‌పై దాడిచేసిన ఒకరిపై..

లక్సెట్టిపేట: ఆర్టీసీ బస్సు డ్రైవర్‌పై దాడి చేసిన ఒకరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై గోపతి సురేష్ తెలిపారు. ఉట్నూర్ డిపోకు చెందిన డ్రైవర్ విజయేందర్‌పై దాడి చేసిన పట్టణానికి చెందిన దూడ శంకర్‌పై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. మంగళవారం మధ్యాహ్నం స్థానిక అంబేడ్కర్‌చౌక్ వద్దకు వచ్చి నా బైక్‌ను ఢీకొడతావా అని బూతులు తిడుతూ కొట్టడంతో డ్రైవర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

గంజాయి సేవిస్తున్న ముగ్గురిపై..

ఇంద్రవెల్లి: గంజాయి సేవిస్తున్న ముగ్గురిపై మంగళవారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఇ.సాయన్న తెలిపారు. మండలంలోని రేపల్లివార్ అశోక్, రేపల్లివార్ లక్ష్మణ్, మోరే అజయ్ ప్రతీరోజు గంజాయి సేవిస్తున్నట్లు తమకు అందిన సమాచారం మేరకు వారికి యూరిన్ కిట్ ద్వారా పరీక్షలు నిర్వహించగా పాజిటివ్ రావడంతో కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై తెలిపారు.

చోరీ కేసులో ముగ్గురు రిమాండ్

ఉట్నూర్‌రూరల్: మండల కేంద్రంలోని సిరికల్చర్ కార్యాలయంలో జనరేటర్ చోరీ చేసిన కేసులో ముగ్గురిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ ప్రసాద్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. నార్నూర్ మండలానికి చెందిన అరవింద్, ఉట్నూర్ మండలం లక్కారంకు చెందిన సందీప్ జనరేటర్‌ను చోరీ చేసి ఉట్నూర్ ఐబీ ప్రాంతంలోని పాత ఇనుప సామానులు కొనుగోలు చేసే దుకాణ యజమాని అబ్రార్‌కు విక్రయించినట్లు తెలిపారు. చోరీ చేసిన ఇద్దరితో పాటు కొనుగోలు చేసిన వ్యక్తిని సైతం అరెస్టు చేసినట్లు పేర్కొన్నారు.


స్వగ్రామానికి చేరిన మృతదేహం



అంతిమయాత్రలో పాల్గొన్న గ్రామస్తులు

దస్తురాబాద్: ఉజ్బెకిస్తాన్ దేశంలో గుండెపోటుతో మృతి చెందిన మండలంలోని మున్యాల గ్రామపంచాయతీలోని పెద్దూర్‌కు చెందిన సంగ సురేష్ (35) మృతదేహం మంగళవారం స్వగ్రామానికి చేరుకుంది. గత నెల 22న ఉజ్బెకిస్తాన్‌లో పనిచేస్తుండగా హఠాత్తుగా గుండెపోటు రావడంతో తోటి కార్మికులు ఆస్పత్రికి తరలించేలోగానే మృతి చెందాడు.

తప్పిన ప్రమాదం



పక్కకు ఒరిగిన ఆర్టీసీ బస్సు

లక్ష్మణచాంద: మండలంలోని పార్‌పెల్లి నుంచి నిర్మల్ వెళ్లే ఆర్టీసీ బస్సుకు ప్రమాదం తప్పింది. మంగళవారం పార్‌పెల్లి నుంచి నిర్మల్ బయలుదేరిన ఆర్టీసీ బస్సు పీచర-రాచాపూర్ గ్రామాల మధ్య అకస్మాత్తుగా ఎదురుగా వాహనం రావడంతో డ్రైవర్ బస్సును నెమ్మదిగా రోడ్డు కిందకు దించాడు. లేదంటే పక్కనే ఉన్న పంట పొలాల్లోకి దూసుకెళ్లేదని ప్రయాణికులు తెలిపారు. డ్రైవర్ చాకచక్యంగా వ్యవహరించడం వల్లే ప్రమాదం తప్పిందన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

కాగజ్‌నగర్‌టౌన్: జవహర్ నవోదయ విద్యాలయంలో 2026-27 విద్యాసంవత్సరానికి 9, 11వ తరగతిలో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకి ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు నవోదయ విద్యాలయం ప్రిన్సిపాల్ రేపాల కృష్ణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలలో 8వ, 10వ తరగతి చదువుతున్న విద్యార్థులు 2025 సెప్టెంబర్ 23లోగా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. 2026, ఫిబ్రవరి 7న ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు. అవకాశాన్ని అర్హులైన విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

కలిసి కట్టుగా కట్టారు..



రాళ్లకట్ట కడుతున్న గ్రామస్తులు

సిరికొండ: మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు మండలంలోని రిమ్మ గ్రామానికి వెళ్లే మట్టిరోడ్డు కొట్టుకుపోయింది. దీంతో ప్రయాణానికి ఇబ్బందులు తలెత్తడంతో మంగళవారం రిమ్మ, తిమ్మాపూర్ గ్రామస్తులంతా కలిసి కట్టుగా కొట్టుకుపోయిన రోడ్డుతో పాటు రోడ్డు పక్కన గల రాళ్లకట్టకు ఇలా మరమ్మతులు చేశారు.

ఆర్జీయూకేటీలో ఇండక్షన్ ప్రోగ్రాం



వీసీకి పూలమొక్క ఇస్తున్న విద్యార్థిని

బాసర: బాసర ఆర్జీయూకేటీలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ స్టూడెంట్ ఆక్టివిటీ సెంటర్‌లో పీయూసీ2 పూర్తి చేసుకుని ఇంజినీరింగ్‌లో విభాగంలో చేరిన కొత్త విద్యార్థులకు మంగళవారం ఇండక్షన్ ప్రోగ్రాం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన వీసీ ప్రొఫెసర్ గోవర్ధన్, ప్రత్యేక అతిథిగా ఓఎస్డీ ప్రొఫెసర్ మురళీదర్శన్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ ఈ సంవత్సరం నుండి ఆర్జీయూకేటీలో 2025 పాఠ్యక్రమం అమలులోకి వచ్చినట్లు తెలిపారు. విద్యార్థుల సమగ్ర అభివృద్ధిని దృష్టిలో పెట్టుకొని కరికులం రూపకల్పన చేయబడిందని, అన్ని ఇంజినీరింగ్ బ్రాంచులకు సమాన ప్రాధాన్యత లభించేలా రూపొందించబడిందన్నారు. ఓఎస్డీ మాట్లాడుతూ మనం కేవలం ఉద్యోగాలు పొందడమే కాకుండా కొత్త ఉద్యోగాలను సృష్టించి దేశానికి సేవ చేయాలని లక్ష్యంగా పెట్టుకోవాలన్నారు. అసోసియేట్ డీన్స్ డాక్టర్ మహేశ్, డాక్టర్ వీ.చంద్రశేఖర్‌రావు, సీఎస్సీ విభాగాధిపతి డాక్టర్ వెంకట్రామన్, తదితరులు పాల్గొన్నారు.

అక్కాచెల్లెళ్లకు పీహెచ్‌డీ పట్టాలు



పట్టాలతో భాగ్యలక్ష్మి, ఉదయరాణి

బోథ్: ఉస్మానియా విశ్వవిద్యాలయం మంగళవారం నిర్వహించిన స్నాతకోత్సవంలో మండలంలోని సొనాలకు చెందిన ఇద్దరు అక్కాచెల్లెళ్లు ఒకే వేదికపై పీహెచ్‌డీ పట్టాలు అందుకున్నారు. ఉస్మానియా యూనివర్సిటీలో ఇర్ల భాగ్యలక్ష్మి తెలుగు సాహిత్యంలో పరిశోధన చేయగా ఆమె చెల్లెలు ఉదయరాణి చరిత్రలో పరిశోధన చేసింది. రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ, ఇస్రో చైర్మన్ నారాయణ, వైస్ ఛాన్సలర్ ఎం.కుమార్ చేతుల మీదుగా పీహెచ్‌డీ పట్టాలు అందుకున్నారు. విద్యారంగంలో తమదైన ముద్ర వేసుకుంటూ, ఉన్నత శిఖరాలను అధిరోహించిన ఈ అక్కాచెల్లెళ్లు పలువురికి ఆదర్శంగా నిలిచారు. నిరంతర కృషి, పట్టుదల ఉంటే ఎంతటి ఉన్నతమైన లక్ష్యాలనైనా సాధించవచ్చని వారు పేర్కొంటున్నారు.

మెడికల్ బోర్డులో లోపాలు సరిచేయాలి



సీఎండీకి వినతిపత్రం ఇస్తున్న జీఎల్‌బీకేఎస్ నేతలు

శ్రీరాంపూర్: సింగరేణి మెడికల్ బోర్డులో లోపాలను సరిచేయాలని కోరుతూ జీఎల్‌బీకేఎస్ గౌరవ అధ్యక్షుడు సాదినేని వెంకటేశ్వర్‌రావు, ప్రధాన కార్యదర్శి జీ.సీతారామయ్య మంగళవారం హైదరాబాద్‌లో సింగరేణి సీఎండీ ఎన్.బలరాంను కలిసి వినతిపత్రం అందజేశారు. ఇటీవల మెడికల్ బోర్డులో అర్హులైన చాలామందిని అన్‌ఫిట్ చేయాల్సి ఉండగా ఫిట్ ఇచ్చి అన్యాయం చేశారన్నారు. చాలామంది కార్మికులు జబ్బులతో బాధపడుతున్నారన్నారు. తిరిగి మెడికల్ బోర్డు నిర్వహించి ఫిట్ ఇచ్చిన వారిని తిరిగి స్క్రీనింగ్ చేయాలని కోరారు. అంతే కాకుండా పెండింగ్‌లో ఉన్న డిపెండెంట్ల ఉద్యోగాలను త్వరితగతిన సెటిల్ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆ యూనియన్ నాయకులు ఎం.శ్రీనివాస్, జీ.అనురాధ, తదితరులు పాల్గొన్నారు.

వాగు దాటి..కుమారుడికి వైద్యం అందించి



వాగు దాటుతున్న మెస్రం గంగారాం

ఇంద్రవెల్లి: మండలంలో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు వాగు ఉప్పొంగడంతో హర్కపూర్ అంద్‌గూడ గ్రామ పంచాయతీ పరిధిలోని మామిడిగూడ ఏ, మామిడిగూడ జీ గ్రామాలకు రెండు రోజులుగా రాకపోకలు స్తంభించి పోయాయి. మంగళవారం వరద నీరు తగ్గడంతో మామిడిగూడ జీ గ్రామ పటేల్ మెస్రం గంగారాం జ్వరంతో బాధపడుతున్న తమ కుమారుడు గురుప్రసాద్‌ను భుజంపై ఎక్కించుకుని ప్రమాదకర పరిస్థితిలో వాగు దాటి ఇంద్రవెల్లి ఆస్పత్రికి తీసుకెళ్లి వైద్యం చేయించాడు. వాగు వద్ద కల్వర్టు నిర్మాణానికి ప్రభుత్వం రూ.3.5 కోట్ల నిధులు మంజూరు చేసినప్పటికీ పనులు ప్రారంభించకపోవడంతో ఈ పరిస్థితి వచ్చిందని గ్రామస్తులు వాపోయారు. ఏటా వర్షాకాలంలో తిప్పలు తప్పడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు దృష్టి సారించి వాగుపై కల్వర్టు నిర్మించాలని కోరుతున్నారు.

కలశయాత్రకు ఘన స్వాగతం



మాజీ సైనికాధికారిని సన్మానిస్తున్న నాయకులు

మందమర్రిరూరల్: 1962లో భారత్, చైనా దేశాల మధ్య జరిగిన యుద్ధంలో 114 మంది యాదవ జవాన్లు వీరమరణం పొందారని బిహార్ రాష్ట్ర మాజీ సైనికాధికారి కిరణ్‌కుమార్ పేర్కొన్నారు. వారి స్మారకార్థం కిరణ్‌కుమార్ చేపట్టిన రేజాంగుల రాజ్ కలశయాత్ర మంగళవారం మందమర్రికి చేరుకుంది. అఖిల భారత యాదవ మహాసభ జిల్లా అధ్యక్షుడు బండి సదానందం ఆధ్వర్యంలో ఘన స్వాగతం తెలిపారు. ఈ సందర్భంగా ఇందూ గార్డెన్ వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కిరణ్‌కుమార్ మాట్లాడుతూ 122 రోజుల క్రితం ప్రారంభమైన యాత్ర ఇప్పటికే 28 రాష్ట్రాలు తిరిగామన్నారు. నవంబర్ 19న ఢిల్లీలో ముగియనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయనను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు మల్లెత్తుల నరేష్ యాదవ్, ఆర్.లక్ష్మణ్ యాదవ్, యశ్వంత్‌రాజ్ యాదవ్, శ్రీనివాస్ యాదవ్ పాల్గొన్నారు.

గంగమ్మ ఒడిలో ఉమామహేశ్వరుడు



నాడు ఉమా మహేశ్వరుడి ఆలయం



నేడు గోదావరినదిలో మునిగిన ఆలయం

లోకేశ్వరం: ఎగువన మహారాష్ట్రలో కురుస్తున్న భారీ వర్షాలకు గోదావరి ఉధృతి పెరిగి మండలంలోని పంచగుడి సమీపంలో ఉన్న నందిపేట్ మండలం ఉమ్మెడ ఉమామహేశ్వర ఆలయం మంగళవారం నీట మునిగింది. ఎస్సారెస్పీలో బ్యాక్ వాటర్ చేరడంతో ఆలయం పూర్తిగా నీట మునిగింది. వచ్చే జనవరి వరకు మందిరం ముంపులోనే ఉండే అవకాశం ఉంది. ఏటా శివరాత్రికి ఉమ్మెడ వీడీసీ, ఆలయ కమిటీ సభ్యులు ఇక్కడ ఉత్సవాలు నిర్వహిస్తారు.

ముసురు మురిపెం..



ఇంటిబాట పట్టిన చిన్నారులు



నెత్తిపై సంచి వేసుకొని ఇంటికి వెళ్తున్న చిన్నారులు

ఇటీవల భారీ వర్షాలు కురుస్తుండడంతో నిర్మల్ జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ బుధవారం పాఠశాలలకు సెలవులు ప్రకటించారు. దీంతో ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల ఆనందానికి అవధులు లేకుండా పోయాయి. రేపు సెలవు ఇచ్చారంటూ చిరునవ్వులు చిందిస్తూ మంగళవారం ఇంటిబాట పట్టారు. ఆ దృశ్యాలను 'సాక్షి' కెమెరాలో క్లిక్ మనిపించింది.

– సాక్షి ఫొటోగ్రాఫర్, నిర్మల్